# కెనడా మామయ్య

"కెనడా మామయ్య వచ్చారట! రేపు మనింటికి వస్తున్నారు!" నేనింకా గుమ్మంలోకి అడుగుపెట్టకముందే ఎదురొచ్చి విశేషమైన ఆ వార్తను రాజీ అందించింది.

"వాళ్ళ బంధువులంతా కలిసి పదిమంది రెండుకార్లలో వస్తారట. గుడిలో స్వామికి కల్యాణం చేయించాలట. మొక్కువుందట!" రాజీతో పోటీపడి చెబుతున్నట్లుగా నందూ హడావుడిగా చెప్పాడు.

"ఉత్తరం వచ్చిందా?" అనడిగాను.

"లేదు. రాజ్యం పిన్ని పొద్దున్న ఊరినుండి వచ్చి అమ్మకు చెప్పిందట" రాజీ చెప్పగానే ఇకవంతు తనది అన్నట్లుగా నందూ మొదలుపెట్టాడు.

"నేను పదిరోజుల నుండీ సున్నుండలు చేయమని అమ్మని అడుగుతోంటే, అలాగేనంటూ బద్ధకించి చేయలేదుకదా! ఈ రోజు చూడు, పిన్ని ఆ కబురు చెప్పగానే సున్నుండలు, కారప్పూస కూడా చేసేసింది".

నేను వంట గది దగ్గరకు వెళ్ళి చూసేసరికి చేసిన పిండి వంటలు అమ్మ డబ్బాలలో సర్దుతోంది. పొద్దుటి నుండి మినుములు వేయించటం, విసరటం ఇవన్నీ చేస్తూ కూర్చుందన్నమాట! అమ్మ చాదస్తానికి కొంచెం చిరాకేసింది.

"వాళ్ళు వుండేది గంటో, గంటన్నరో! దానికి నువ్వింత హైరానా పడిపోవాలా?! అసలే రెండు రోజులనుండీ నడుం నొప్పి అంటున్నావు కూడా కదా!" అన్నాను.

"బావుందే! మనం చేసుకోవటంలేదా ఏం! చేసి పెట్టుకుంటే మీరూ నాలుగు రోజులు తింటారుగా! వాళ్ళు ఏ వేళకి వచ్చినా అప్పుడు హడావుడి పడకుండా వుంటాయిగా! వాడికి సున్నుండలంటే చాలా

ఇష్టం! మళ్లా ఎన్నేళ్ళకి వస్తాడో!" నుదుటకు పట్టిన చెమటను చీరెచెంగుతో అద్దుకుందూ అంది అమ్మ.

అమ్మ మొహం ఆనందంతో తళతళలాడుతోంది! అలసటన్నదే కనుపించటంలేదు! మా ఊరి గుడికి ఉన్న ప్రాముఖ్యత వలనైనా మామయ్య ఇన్నాళ్ళకు వస్తున్నాడు మరి! "వాళ్లంతా ఇక్కడికి వస్తారో, లేక వాళ్ళు అటు వెళ్ళిపోతే, పిల్లని తీసుకుని వీళ్ళిద్దరూ వస్తారో!' స్వగతంలా అమ్మనుకుంటోంటే నేను నిట్టూరుస్తూ అక్కడ నుండి వచ్చేశాను.

ఆ రాత్రి మేం నలుగురం పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నామేకానీ మనసుకేమీ ఎక్కటంలేదు. ఆలోచనలన్నీ మామయ్య చుట్టూనే తిరుగుతున్నాయి!

"రేపు ఆదివారమే కాబట్టి ఫరవాలేదు. అందరం ఇంట్లోనే వుంటాం" అంది రాజీ.

"నేను మాత్రం ఇంట్లో వుండనసలు. వాళ్ళు వచ్చి వెళ్ళాకనే ఇంటికి వస్తాను!" అన్నాడు నందూ బింకంగా.

వాడికి మామయ్యంటే కొంచెం కోపం. నిజానికి మా నలుగురికీ కూడా అంతే. కాకపోతే వాడిలా మేం వ్యక్తపరచం.

మాకు ఆ మామయ్యతో ప్రత్యక్షంగా పరిచయం లేకపోయినా, అమ్మ చెప్పే కబుర్లనుబట్టి మామయ్య మాటలు, చేతలు అన్నీ మాకు సుపరిచితాలే!

అమ్మ మాకు అప్పుడప్పుడూ తన చిన్నప్పటి సంగతులు చెబుతూంటుంది. తన బంధువర్గంలోని వాళ్లందర్నీ పేరు పేరునా గుర్తు చేసుకుంటూ ఆ రోజుల్ని నెమరేసుకుంటూ వుంటుంది. "ఆ ఆపేక్షలూ, అభిమానాలూ అన్నీ ఆ తరం మనుష్యులతోనే తరలి వెళ్ళిపోయాయి" అంటూ నిట్టూరుస్తుంది.

మాకు ఊహ తెలిసేటప్పటికే నాన్నమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు ఎవరూలేరు. అంతా హడావుడిగా పైలోకాలకి వెళ్ళిపోయారు. మాకు పెద్దవాళ్ళెవ్వరూ లేకపోవటాన్నేమో, అమ్మ వాళ్ళ ఉమ్మడి కుంటుంబంలోని తన చిన్నప్పటి సంగతులు చెబుతోంటే, మాకు అద్భుతంగా, అపురూపంగా అనిపిస్తాయి! వివరాలడుగుతూ చాలా ఆసక్తిగా ఆ కబుర్లను వింటూంటాం.

మా అమ్మమ్మగారిల్లు నాకు కొంచెం గుర్తువుంది. విశాలమైన ఖాళీ స్థలంలో, ఎత్తైన ప్రహరీగోడల మధ్య, పెద్దవసారాతో వుండే మండువాలోగిలి. మా తాతగారు వాళ్ళు అయిదుగురు అన్నదమ్ములు. అందరికీ ఉద్యోగాలయినా, వ్యాపారమైనా, వ్యవసాయమైనా ఆ వూళ్ళోనే. అంతా కలిసి ఉండే వాళ్ళు. అందరికీ కలిపి డజను మంది పిల్లలు. అమ్మవాళ్ళ నాన్నమ్మ, తాతయ్య కూడా అప్పటికి వున్నారు. అంతమంది పిల్లలూ, పెద్దలూ కలిసి ఒకే ఇంట్లో వుండటం... గొప్ప విషయంగా మాకు అనిపించేది!

"అంతమంది వుంటే, తగవులు వచ్చేవికావా?" అని మేం అడిగితే అమ్మ చెప్పేది "అంతా మా తాతగారి పెత్తనం కింద ఒక పద్ధతి ప్రకారం జరిగిపోతూండేది. ఆయనంటే అందరికీ భయం, భక్తీ కూడా వున్నాయి. ఏవో చిన్న చిన్న మాటపట్టింపులు ఎప్పుడైనా వచ్చినా వెంటనే సద్దుమణిగేవి. మా ఇల్లు ఎప్పుడూ పెళ్ళివారిల్లులా, పాలవెల్లిలా కళకళలాడుతూ వుంటుందని ఊళ్ళో అంతాఅనేవాళ్లు.

ఎప్పుడైనా పండుగలప్పుడు పిల్లా, పెద్దా అంతా కలిసి ఒక్కసారే భోజనానికి కూర్చునేవాళ్లం. నాయనమ్మ వడ్డన చేసేది. తాతగారు చుట్టూ తిరుగుతూ, అందర్నీ సరిగా తినమని హెచ్చరిస్తూ వుండేవారు.

అటువంటప్పుడు ఒకసారి మా తాతగారు అందర్నీ మురిపెంగా చూస్తూ అన్నారు నాయనమ్మతో. “నేను ఆస్తిపాస్తులు సంపాదించలేదు అంటావుగానీ ఈ ఊళ్ళో నా కంటే ఐశ్వర్యవంతుడు ఎవరున్నారో చెప్పు...?” అని. పిత్రార్జితానికి అదనంగా ఆస్తిపాస్తులు మా తాతగారు సంపాదించలేదుగానీ దానం ధర్మం చేసి మంచిపేరు, గౌరవం మాత్రం సంపాదించుకున్నారు.

తన పిల్లలంతా తనకళ్ళముందే ఐకమత్యంగా కలిసివుండటం తాతగారికి ఆనందంగా, గర్వంగా ఉండేది. ఆయన చివరి వరకూ ఆ ధీమాతోనే దర్జాగా బతికారు!”.

అమ్మ అలా చెబుతోంటే... ఏవో రసవత్తరమైన కథల్ని వింటూన్నట్లుగా ఇష్టంగా వినేవాళ్ళం! మధురమైన బాల్యస్మృతులు మనసు అరలో దాగివుండే నిధి నిక్షేపాలే! అందుకే కాబోలు ఆ కబుర్లు చెప్పేటప్పుడు... ఆనందతరంగితమయ్యే మనసును ప్రతిబింబిస్తూ అమ్మ కళ్ళు తళతళలాడుతుంటాయ్!

అమ్మ చెప్పే తీరునిబట్టి కాబోలు కొన్ని దృశ్యాలు మా కనులమందు కనుపిస్తున్నట్లే వుంటాయ్!

కార్తీమాసపు చలి రోజుల్లో... తెల్లవారుఝామున పిల్లలంతా ఒక పెద్ద దుప్పటి కప్పుకుని గోల గోలగా కబుర్లు చెప్పుకుంటూ గోదావరి స్నానానికి నాన్నమ్మ వెనుక నడిచి వెళ్లటం... ఒకరి మీద ఒకళ్లు నీళ్లు చల్లుకుంటూ కేరింతల మధ్య స్నానాలు పూర్తిచేసి, అరటిదొప్పల్లో వెలిగించిన ఆవునేతి దీపాలు గోదావరి ఆలలపై మెల్లగా కదిలి వెళ్ళే రమణీయ దృశ్యాన్ని తడిబట్టలతో ఒడ్డున నిలబడి తన్మయంగా చూడటం...

నాయనమ్మని మెప్పించటం కోసం పిల్లలంతా తులసి కోట చుట్టూ కూర్చుని ఒకరిని మించి మరొకరు పెద్దగా భజన కీర్తనలు పాడి ప్రసాదాలను ఆప్యాయంగా తినటం...

వేసవి కాలపు రాత్రిళ్ళు ఆరు బయట పడుకుని చుక్కల్ని చూస్తూ నాయనమ్మ చెప్పే కమ్మని కథల్ని వింటూ నిద్రలోకి జారిపోవటం...

హరికథలు, తోలు బొమ్మలాటలు చూస్తూ తెల్లవార్లూ మేల్కోవటం...

ఇవన్నీ మా కనులముందు కనుపిస్తూ మమ్మల్ని మురిపించే దృశ్యాలు!

అమ్మకి ఒక్కడే తమ్ముడు. పేరు ఆనంద్. అంతా ‘నందూ’ అని పిలిచేవాళ్లు. క్లాసులోనూ, ఆటల్లోనూ ఫస్టున వుండేవాడట! ఆ వీధి పిల్లలందరికీ నాయకుడిలా వుండి వాళ్ళింటి ముందు నాటకాలు వేయించటం, పద్యాల పోటీలు నిర్వహించటం... ఇవన్నీ సరదాగా చేస్తూండేవాడట. దుప్పట్లకి టాకాలు వేసి కర్టెన్లుగా తయారు చేయటం, పోర్షనులు రాసి పెట్టటం, హార్మోనియం వాయించటం... ఇవన్నీ అమ్మ చేస్తూ వుండేదట!

“ఎప్పుడూ ఏవో చిలిపి పనులు చేస్తూ పెద్దవాళ్ళని కూడా నవ్విస్తూ వుండేవాడు! పెద్దయ్యాక కూడా వాడికి చిన్నపిల్లలంటే చాలా ఇష్టం! వాళ్లతో ఆడుకుంటూ, కాసేపు ఏడిపించి, మళ్ళీ చాక్లెట్లు పంచేవాడు!” అంటూ అమ్మ మామయ్యని గురించి చెబుతూండేది.

చదువులో ఫస్టు... ఆటపాటల్లో బెస్టు... నాటకాలంటే ఇంటరెస్ట్! ఆ మామయ్య హీరో మా దృష్టిలో! అలాంటి సరదా మామయ్యపట్ల మాకు తెలియకుండానే మా మనసులలో ఆత్మీయతా, ఏదో ఆరాధనా ఏర్పడిపోయాయి! మా తమ్ముడు నందకిషోర్‌ని కూడా మేం నందూ అనే పిలుస్తాం.

"ఆ పేరుతో పిలుస్తున్నందుకేమో, వీడికి అన్నీ మా తమ్ముడి బుద్ధులు, పోలికలు వచ్చాయి!" అంటుంది అమ్మ, అప్పుడప్పుడూ. అలా అన్నప్పుడు వాడి మోహం చూడాలి, వెలిగిపోతూండేది! మా వైపు చాలా బడాయిగా చూసేవాడు! గాంధీతోనో, నెహ్రూతోనో పోలుస్తున్నారన్నంత గొప్పగా ఫీలయిపోయేవాడు!

కెనడాలో డాక్టరుగా జాబ్ చేయటానికి మామయ్య వెళ్లినప్పుడు నందూకి రెండేళ్ళ వయసంతే. నేనప్పుడు సెకండ్ క్లాసులో ఉన్నాను. నా తర్వాతది మంజూ ఫస్ట్ క్లాసులో ఉంది. రాజీకి మూడేళ్లు. ఆఖరివాడు నందూ.

కెనడా వేళ్ళేముందు మామయ్య కొన్ని ఫోటోలు తీశాడు. నందూకి పంచెకట్టి, తలపాగాచుట్టి, మీసాలుపెట్టి, చేతిలో కర్రపెట్టి రైతు వేషంలో ఒక ఫోటో తీశాడు. అదీ, నందూని ఎత్తుకుని మామయ్య వున్న ఫోటో రెండూ ఒక ఫోటో ఫ్రేములో అమ్మ పెట్టింది. ఆ ఫోటో స్టాండుని నందూ తన ఆలమారాలో పుస్తకాల పక్కన పెట్టుపెట్టుకునేవాడు. దుమ్ముపడినా, పడకపోయినా సరే, అద్దాన్ని శుభ్రంగా రోజూ తుడుచుకునేవాడు. వాడికి ఆ ఫోటో అంటే అంత అపురూపం మరి!

మామయ్య కెనడా వెళ్లిన అయిదేళ్లకు ఇండియా వచ్చారు. ఫలానా తేదీ మా ఇంటికి వస్తున్నామని ఉత్తరం వచ్చింది. అప్పటికి మామయ్య వాళ్లకి అమ్మాయిపుట్టి సంవత్సరంన్నర అయింది.

ఆ ఉత్తరం వచ్చినప్పుడు మా సంతోషానికి అవధిలేదు! నందూ అయితే ఆ ఉత్తరం పట్టుకుని గెంతులే వేశాడు. ఇండియా ప్రెసిడెంట్ మా ఇంటికి వస్తున్నాడన్నంత గొప్పవార్తలా.. ఫారిన్ నుండి మామయ్య వస్తున్నారనే విషయాన్ని తన స్నేహితుల మధ్య దండోరా వేసుకున్నాడు! వాళ్లందర్నీ చుట్టూ కూర్చోబెట్టుకుని మామయ్య గురించి గొప్పగా చెబుతూ తనకి విమానం తెస్తారో, రైలు తెస్తారో అంటూ రకరకాల ఊహాగానాలు చేసేవాడు!

మేమంతా కూడా రోజుల్ని లెక్కపెట్టుకుంటూ ఉత్సాహంగా ఎదురుచూశాం. ఆ రోజు నందూ, రాజీ స్కూలుకి వెళ్ళమని అన్నారు. నాకూ, మంజూకి క్వార్టర్లీ ఎగ్జామ్స్ పూర్తవటంతో వారం రోజులు సెలవులు ఇచ్చారు. "ఏ వేళకి వస్తారో తెలియదు. స్కూలు మానేయటం దేనికీ, రెండు రోజులు ఉంటారుగా" అని అమ్మ అంటే వాళ్ళిద్దరూ గునుస్తూ వెళ్ళారు.

ఆ రోజు సాయంకాలం మూడు గంటల సమయంలో మామయ్య, అత్తయ్యతో పాటూ, అత్తయ్య నాన్నగారు, ఆయన స్నేహితులు ఇద్దరూ కూడా వచ్చారు. మామయ్య ఏదో ఇండస్ట్రీపెట్టబోతున్నారట. వాళ్ళిద్దరూ అందులో పార్టనర్స్. ఆ ఇండస్ట్రీకి స్థలం కొనే ప్రయత్నంలో ఎక్కడికో వెళ్తూ, మధ్యలో ఇక్కడికి వచ్చారు.

మళ్ళీ ఇండియా త్వరలోనే వస్తాననీ, అప్పుడు తీరుబడిగా రెండు రోజులు వుంటాననీ చెప్పి ఒక గంటసేపు కూర్చుని హడావుడిగా వెళ్ళిపోయారు. అప్పుడూ అమ్మ నాలుగు రోజులుంటారనుకుని తమ్ముడి ఇష్టాలను గుర్తు చేసుకుని నాలుగు రకాల పిండి వంటలు చేసి వుంచింది. ఆ కాసేపటిలో ఎవరూ ఏమీ తినలేదు. కాఫీలు త్రాగారంతే. ఎవరితోనూ మాట్లాడినట్లుగానూ అనిపించలేదు. ఆ కాసేపూ మాకు కాఫీ, టిఫిన్ల హడావుడి సరిపోయింది. మామయ్య కూతురు వీణని ఎత్తుకోవాలని సరదాపడినా కొత్తవల్ల దగ్గరికి రాలేదు.

మామయ్య వాళ్ళ కారు అటు సందు మలుపు తిరిగిందో, లేదో ఇటు నందూ, రాజీ స్కూలు నుండి వచ్చారు. వాళ్ళకి ఎదురొచ్చిన కారులోనే మామయ్య వెళ్ళిపోయారని తెలిసి ఒక క్షణం అయోమయంగా చూస్తూ నిలబడిపోయారు.

"మేం స్కూలు నుండి వచ్చే వేళయిందని ఎందుకు ఉండమనలేదూ?" అంటూ పుస్తకాల బేగ్‌ని విసిరికొట్టి పెద్దగా ఏడుపు మొదలుపెట్టాడు. చివరికారోజు భోజనం చేయకుండానే నిద్రపోయాడు. మా అందరికీ కలిగిన ఆశాభంగం కూడా తక్కువేం కాదు! ఒక్కోసారి జీవితంలో చాలా చిన్నవని అనిపించే సంఘటనలే మనసుపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంటాయి!

వాళ్ళు వెళ్ళాక లోపలి గదిలో అత్తయ్య కూర్చున్న చోట కుర్చీలో ఒక పాకెట్టు వుండటం గమనించాం. అందులో రాజీ సైజుది రెడీమేడ్ ఫ్రాకు ఉంది.

ఆ తర్వాత ఒక నెల రోజులకనుకుంటా ఏదో పండుగ వస్తే "మామయ్య తెచ్చిన గౌను వుందిగా, వేసుకోరాదూ?" అంది అమ్మ రాజీతో. అది జవాబేం చెప్పలేదుగానీ అమ్మవేపు కోపంగా మిర్రి మిర్రి చూసింది. ఏమనుకుందోగానీ అమ్మ కూడా ఏం మాట్లాడలేదు. ఆ తర్వాత కూడా రాజీ ఆ గౌను వేసుకోలేదు. చివరకు అది వాడకుండానే పాత బట్టలలోకి వెళ్ళిపోయింది. ఈ మధ్యనే అమ్మ ఎవరికో ఇచ్చేసింది.

ఆ తర్వాత మామయ్య మళ్ళీ ఇండియా రెండు మూడు సార్లు వచ్చారని విన్నాం. మాకు ఉత్తరాలు కూడా లేవు. ఫ్యాక్టరీకి సంబంధించిన పనులనీ, మరదలు పెళ్ళనీ, ఏవో కారణాల మీద వచ్చారట.

మామయ్య వాళ్ళ అత్తగారింటి పక్కనే రాజ్యం పిన్ని వాళ్ళ ఇల్లు. మాకు దూరపు బంధువులే అయినా తరచుగా మా ఇంటికి వస్తూంటుంది. వాళ్ళ అత్తగారిల్లు ఈ ఊళ్ళోనే. అమ్మకు బంధు ప్రీతి ఎక్కువే. మా ఇంటికి తరచూ బంధువులు వస్తూనే వుంటారు. అలా ఎవరైనా వచ్చినప్పుడు పని ఎక్కువ అయినా, అమ్మ వాళ్లతో గల గల కబుర్లు చెబుతూ చాలా ఉల్లాసంగా కనుపిస్తూంటుంది.

రాజ్యం పిన్ని వచ్చినప్పుడల్లా మామయ్య వాళ్ళ కబుర్లు వివరంగా చెబుతూంటుంది. మామయ్య ఆస్తిపాస్తులు అంచెలంచెలుగా ఎలా పెరిగిపోతున్నాయో, ఇండస్ట్రీలో ఎంతగా లాభాలు వస్తున్నాయో, ఎక్కడెక్కడ ఇళ్ళ స్థలాలు కొన్నారో, పొలాలు ఎన్ని ఎకరాలు కొన్నారో, పిల్లకి ఎంత బంగారం కొన్నారో ఆ వివరాలన్నీ చెబుతుంటే... "అలాగా, బావుంది, బావుంది!" అంటూ ఆనందంగా తలూపుతూ వింటుంది అమ్మ. తన తమ్ముడి సంగతులు ఇంకెవరి ద్వారానో తెలుసుకోవాల్సి వచ్చినందుకు కష్టంగా వుండదా? నాకది ఆశ్చర్యంగానే వుంటుంది.

ఇప్పుడు అమ్మ మునుపటిలా తమ్ముడి గురించి పదే పదే మా దగ్గర తలుచుకోవటం లేదు. మాకు కోపమని గ్రహించి ఊరుకుంది.

ఒకసారి నందూ అమ్మని అడిగాడు. "మామయ్యకీ, నీకూ ఆస్తి పంపకాల దగ్గర తగువేమైనా వచ్చిందా?" అంటూ.

అమ్మ తెల్లబోయి "అదేం లేదురా!" అంది. "నువ్వు అక్కడ నుండి ఏమైనా తెమ్మని రాశావా?" అనడిగాడు మళ్ళా. "లేదే! ఏం, ఎందుకలా అడుగుతున్నావు?" అంది అమ్మ ఆశ్చర్యంగా.

"మరి ఏ కారణం లేకుండా మామయ్య మనింటికి ఎందుకు రావటం లేదమ్మా? మనం ధనవంతులం కాదనా?"

"ఛ! ఛ! వాడికి మనసులో అలాంటివేం ఉండవు!" అమ్మ మాటలకి అడ్డువస్తూ రాజీ వెంటనే అంది. "అవునవును. ఏం వుండవు అభిమానాలూ ఆప్యాయతలూ కూడా! అంతా ఖాళీ!" మేం అంతా నవ్వేశాం. అమ్మ మొహం చిన్నబోయింది.

చాలాసేపటి వరకూ అలా శూన్యంలోకి చూస్తూ పరధ్యానంగా కూర్చుండిపోయింది. తనకూ తెలియని కారణాన్ని వెతుక్కుంటూన్నట్లుగా!

అప్పుడప్పుడు అమ్మ పరధ్యానంగా కూర్చుండిపోతుంది. "ఏమిటమ్మా?" అనడిగితే "ఏంలేదు" అంటూ సర్దుకుని మామూలయిపోతుంటుంది. 'తమ్ముడిని గుర్తుకు తెచ్చుకుంటూందా, దేశం నాలుగు మూలలా ఉద్యోగాలంటూ చెల్లా చెదురైపోయిన తన పెదనాన్న, చిన్నాన్నల పిల్లలను తలుచుకుంటూ వుంటుందో' అని నేననుకుంటూ వుంటాను.

అమ్మ అభిప్రాయం ప్రకారం తన తమ్ముడికి రావాలని వున్నా మరదలే ఏదో వంక పెట్టి 'తర్వాత వెళ్లొచ్చులే' అంటూ రానీయకుండా చేస్తుందని! ఇదే నాకు విచిత్రంగా అనిపిస్తుంది. తన తమ్ముడికి ఎంతో పౌరుషమని చెబుతూ వుంటుంది, మరి అంత మాత్రం స్వతంత్రం లేకుండా బ్రతుకుతున్నాడా?! మా పక్కింటి సుబ్బమ్మగారూ అంతే. కొడుకు ఏం చేసినా కోడలదే తప్పు అంటుంది. ఇష్టమైన వాళ్ళ తప్పుల్ని గుర్తించటానరికి ఎవరికీ మనసొప్పదేమో! వేరే వాళ్ళని బాధ్యుల్ని చేస్తే కొంచెం తృప్తిగా వుంటుంది కాబోలు! ఇలా అంటే అమ్మ 'నీకర్థం కాదు లేవే' అనేస్తుంది.

అప్పుడు నేను సెవన్త్‌క్లాసులో ఉండగా వచ్చిన మామయ్య మళ్లా ఇన్నేళ్లకు మంజు ఇంటరు ఫస్టియరులోకీ, నేను సెకండియరులోకీ వచ్చాక వస్తున్నారు.

"రేపు మామయ్య వచ్చాక కొన్ని ప్రశ్నలడగాలి" అంది రాజీ పుస్తకం మూసి పక్కన పెట్టేస్తూ.

"ఏం అడుగుతావు?" అని మంజు అడిగితే, "నీ కెందుకూ చెప్పటం?" అంది రాజీ.

"ఎందుకేమిటీ! రేపు తడబడకుండా మామయ్యని సరిగా ఇంటర్వ్యూ చేయగలుగుతావు, రిహార్సలు వుంటే! కనుక కాసేపు నేను మామయ్యని అనుకో" అంటూ ఠీవిగా నిలబడి పోజుపెట్టింది.

రాజీ కూడా నిజంగా ఇంటర్వ్యూ చేసేదానిలా సిద్ధపడింది. "మామయ్యా, అంతస్తుల తారతమ్యం అయినవాళ్ళ మధ్య రాకపోకలకి కూడా అంతరాయం కలిగిస్తుంది. ఎందువలన? మీ అభిప్రాయం ఏమిటి?"

మంజు తల వంకించి, ఆలోచిస్తున్నట్లుగా ఒక క్షణం ఆగి మొదలుపెట్టింది.

"చూడమ్మా రాజీ, నువ్వీ ప్రశ్న ఎందుకడిగావో నాకు అర్థం అయింది. అంతస్తులనేవి రాకపోకలకి అడ్డువస్తాయంటే నేను అంగీకరించను. అనేక కారణాలు ఉంటూంటాయి. నెలల బిడ్డ తల్లిని ఒక క్షణం కూడా వదిలి ఉండటానికి ఇష్టపడడు. తల్లి కూడా అంతే. వయసు వచ్చే కొద్దీ, స్నేహితులు, ఆటలు, స్కూలు వీటన్నింటితో అతని ప్రపంచం పెద్దదవుతుంది. తల్లికి కొంచెం దూరం జరుగుతాడు అంతమాత్రాన అభిమానం లేదని అనగలమా? ఒక ఇంట్లో పుట్టి పెరిగిన వాళ్ల మధ్య కూడా దూరం క్రమేపీ పెరగటం సహజం. సంసారం, ఉద్యోగం, బాధ్యతలు అన్నీ వేరయ్యాక తరచు కలుసుకోవటం కుదరనంత మాత్రాన అభిమానాలు లేకుండా పోతాయన్నది నిజం కాదు, వీలు కాకపోవటమే కారణం కానీ!"

"మనసుంటే మార్గముంటుంది అంటారుగా?"

"నిజమే. కానీ మనసెంతగా వున్నా మార్గాలన్నీ మూసుకుపోయిన సందర్భాలు కూడా వుంటాయి!" మంజూ చిరునవ్వుతో అంది.

నాన్నగారు అప్పుడప్పుడూ అంటూంటారు. 'ఎదుటివాళ్ల దృక్పథం నుండి కూడా మనం ఆలోచించగలిగితే, సగం సమస్యలు పరిష్కారమవుతుంటాయని.' అందుకనే మంజూ అలా మాట్లాడుతోందని అనుకున్నాను. చిరునవ్వుతో ఆసక్తిగా వాళ్ళ అభినయాన్ని చూస్తున్నాను.

మంజు ఇంకా మామయ్య పాత్రని వదిలిపెట్టలేదు. షోకేసులో వున్న వెండికప్పులను చూస్తూ ప్రక్కనే వున్న నందూతో అంది.

“ఏమిటోయ్ నందూ, ఇవన్నీ ఎవరివి?”

నందూ కూడా యాక్షన్ మొదలుపెట్టేశాడు ఉత్సాహంగా. తలపైకెత్తి కొంచెం గర్వంగా అన్నాడు. “ఇవన్నీ నాకు వచ్చినవే మామయ్యా! మా స్కూలులో రెండు సంవత్సరాల నుండీ డిబేటింగ్, ఎస్సేరైటింగ్‌లో నేనే ఫస్టు!”

“గూ...డ్, వెరీ గుడ్! అలా వాటి పక్కగా నిలబడు. ఒక స్నాప్ తీస్తాను” అంటూ కెమేరా సరి చూసి క్లిక్‌మనిపించినట్లుగా అభినయించి చేయి చాపింది ఫోటో ఇస్తున్నట్లుగా. “అరే, అప్పుడే ఫోటో వచ్చేసిందే మామయ్యా” అన్నాడు నందూ మొహం ఆశ్చర్యంగాపెట్టి.

“ఆఁ... ఇది మరి ఇన్‌స్టెంట్ కెమేరా కదా! బావుందా, ఇది నీకు ఇద్దామనే తెచ్చాను” అంది మంజు.

“ఒద్దు మామయ్యా! మాకిలాంటి ఖరీదైన బహుమతులు అవసరంలేదు. కానీ ఇండియా వచ్చినప్పుడు మాతో సరదాగా ఒక రోజు గడిపి వెళ్లినా మాకు అదే ఆనందంగా ఉంటుంది!” అన్నాడు నందూ పాత్రలో లీనమై నటిస్తున్న నటుడిలా భావోద్వేగంతో! వాడి కన్నుల్లో సన్నటి నీటిపొర!

మేమంతా చప్పట్లు కొడుతూ పెద్దగా నవ్వాం! “ఏమిటర్రా ఆ గోల, ఇంకా నిద్రపోలేదూ?” అంటూ అమ్మ వచ్చింది.

“రాక రాక ఇన్నేళ్లకి వస్తున్న మామయ్య మహారాజా కబుర్లతో మాకు నిద్రరావటంలేదు” అంది రాజీ తమాషాగా కళ్ళు తిప్పుతూ.

అమ్మ నిట్టూరుస్తూ అంది “దేశం కాని దేశంలో, దూరాబారాన వున్న వాళ్ళకి మాటిమాటికీ రావాలని వున్నా కుదురుతుందా మరి!”

ఇన్నాళ్ళకి వస్తున్నాడనే ఆనందంలో అమ్మ ఇంతకు ముందు రాలేదనే విషయాన్ని మరిచిపోగలిగింది.

“రాకపోకలూ లేక.. పెట్టుపోతలూ లేక మరి బంధుత్వాలకి అర్థం ఏమిటమ్మా ఇక?” చేతులు చాపుతూ, బుగ్గలు నొక్కుకుంటూ మా పక్కింటి సుబ్బమ్మగారిని అనుకరిస్తూ అంది రాజీ. రెండు రోజుల క్రితం ఏదో సందర్భంలో ఆవిడ అమ్మతో ఇలాగే ఈ మాటలు అనటం మేమంతా విన్నాం. రాజీకి ఆవిడను అనుకరిస్తూ అప్పుడప్పుడూ అలా మాట్లాడి మమ్మల్ని నవ్వించటం మామూలే.

“నీకూ ఏ అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అబ్బాయినో చూసి చేస్తే, అప్పుడు తెలుస్తుంది, వేలకి వేలు ఖర్చుపెట్టి రావాలంటే ఎంత కష్టమో!” అంది అమ్మ తనూ నవ్వుతూ.

“ఏం నేనెందుకు రానూ...?! మా అమ్మకి జలుబు చేసినా చూడటానికి వస్తాను, మా అక్క కొత్త చీరెకొనుక్కున్నా చూడటానికి రావాల్సిందే అని తీసుకు వస్తాను. కాకపోతే వాళ్ళింటికి వెళ్ళం అంతేగానీ...” రాజీ మాటలకి మేం అంతా ఫక్కున నవ్వుతూంటే, “చాల్లెండి అల్లరి. ఇక పడుకోండి” అంటూ అమ్మ వెళ్ళిపోయింది.

మరునాడు ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే మా ఇంట్లో హడావుడి ప్రారంభం అయ్యింది! కల్యాణం అదీ పూర్తయి పన్నెండు గంటలకి వాళ్ళందరూ వస్తే భోజనాలు చేయమని అనవచ్చని అమ్మ నాలుగు రకాల కూరలను కొంచెం ఎక్కువగా చేసి పెట్టింది, అన్నం ఒకటే వాళ్ళు వచ్చాక వండవచ్చునని. నాన్నగారు మార్కెటుకు వెళ్ళి బుట్టనిండా అరటి, ద్రాక్ష, యాపిల్స్ తెచ్చారు.

నేను మంజూ కలిసి కిటికీల కర్టెన్లు, డోర్ కర్టెన్లు, టేబులు క్లాత్‌లు అన్నీ తీసేసి ఇస్త్రీవి వేశాం. అక్కడవి ఇక్కడ, ఇక్కడివి, అక్కడ అలా కొన్ని సామాన్లు జరిపి ఇల్లు నీట్‌గా అందంగా సర్దామనుకుని తృప్తిపడ్డాం.

నందూ పదకొండు గంటలకే భోజనం చేసేసి సాయంకాలానికిగానీ రానని చెప్పి వాసూ వాళ్ళింటికి వెళ్లాడు. వాడి ఉద్దేశం చెప్పకపోయినా అర్థమైంది! మామయ్య వచ్చాక కిందటిసారి వాడు స్కూలు నుండి వచ్చే వరకూ వుండకుండా వెళ్ళిపోయినందుకు వాడికి కోపం వచ్చిందన్న విషయాన్ని మేము చెబితే, అప్పుడు మామయ్య పిలిపించాలని, అప్పుడు రావచ్చని! అందుకే దూరం కాకుండా ఎదురుగా మూడిళ్ళ అవతల ఉండే వాసూ ఇంటికి వెళ్ళాడు.

ఒంటిగంటవుతూండగా నందూ చెమటలు కక్కుతూ వచ్చాడు. “గుడి ముందు రెండు కార్లు ఉన్నాయి. మామయ్య వాళ్లు వచ్చారన్నమాట” అంటూ నాతో చెప్పాడు. ఇంత ఎండలో ఆ విషయం తెలుసుకోవటానికి మైలున్నర దూరం సైకిలు తొక్కుకుంటూ వెళ్ళాడన్నమాట!

రెండు గంటలకి మేమంతా భోజనాలు చేశాం. కాసేపుండి చేస్తానంటూ అమ్మ తినలేదు. ఏదో కారు హరన్ వినిపిస్తే నేను హడావుడిగా గుమ్మం దగ్గరకు పరుగెత్తాను. నందూ కూడా వాసూ వాళ్ళింటి గుమ్మంలో కనుపించాడు! నాకు నవ్వొచ్చింది! వాడు కూడా హారన్ విని, వచ్చారేమోనని లోపలికి నుండి పరుగెత్తి వచ్చాడన్న మాట! కోపమని అంటున్నాగానీ మామయ్య రాక కోసం ఆతృతగానే ఎదురు చూస్తున్నాడు!

మూడు గంటలు దాటింది. అమ్మ గుమ్మందగ్గరకు వెళ్ళి నిలబడింది. అటు వెళ్తున్న రాజ్యం పిన్ని ఆగి అమ్మని పలుకరించింది “మీ వాళ్ళు వచ్చి వెళ్ళారా?’ అంటూ.

“ఇంకా రాలేదేమిటో! అదే చూస్తున్నాను” అంది.

“అదేమిటీ, రాకుండానే వెళ్ళారా అయితే! వాళ్ళు వెళ్లి గంటపైనే అయింది. మా వాళ్ళ ఇంటిముందునుండే కార్లు వెళ్లటం చూశాను” అంది రాజ్యం పిన్ని.

అమ్మ లోపలికి వచ్చి నీరసంగా గోడకి చేరగిలబడి కూర్చుండిపోయింది. “వస్తున్నట్లుగా కబురు పంపించీ రాలేదేమిటమ్మా?” అన్నాను.

“కబురేం పంపించలేదే. ఇక్కడికి గుడిలో కల్యాణం చేయించటానికి వస్తున్నట్లుగా చెప్పి ‘అక్కయ్య అక్కడే ఉందా?’ అని రాజ్యాన్ని తమ్ముడు అడిగాడట. ఇక్కడే వున్నారని చెప్పానని రాజ్యం అంది. ఇక్కడి వరకూ వచ్చి రాకుండా వుంటాడని ఎలా అనుకు...” అమ్మ కంఠం బొంగురుపోయింది.

నేను ఆశ్చర్యపోయాను! మామయ్య వస్తున్నట్లుగా కబురు పంపించకపోయినా, తను ఈ వూళ్లోనే వుందని తెలుసుకాబట్టి తప్పక వస్తాడని అనుకుని మాకు చెప్పింది. అమ్మ నమ్మకాన్ని మామయ్య ఎంతగా దెబ్బతీశాడు!

గుండె గదిలో అపురూపంగా దాచుకున్న నిధి నిక్షేపాలని ఎవరో దోచుకుపోయినట్లుగా.. విషాదంగా కూర్చున్న అమ్మని చూస్తోంటే నాకు మనసంతా చేదు చేదుగా అయిపోయింది.

ఇంతలో నందూ వచ్చాడు. అమ్మని చూసి ఏమిటన్నట్లుగా చూశాడు. మావయ్య వాళ్ళు రాకుండానే వెళ్ళిపోయారన్న విషయం మెల్లగా చెప్పాను. వాడు భుజాలెగురవేసి అదొర రకంగా నవ్వాడు. అమ్మదగ్గరకు వెళ్ళి ఎదురుగా కూర్చుని అన్నాడు.

"అమ్మా, మామయ్య నీ మనసుకి కష్టం కలిగించారు కానీ, మాకు మాత్రం మరొక విధంగా ఉపకారమే చేశారు తెలుసా?"

అమ్మ అయోమయంగా చూసింది.

"అవునమ్మా, ఆత్మీయులుండటమే అసలైన ఐశ్వర్యమని నువ్వు అంటావుగా! రేపు మా మధ్య అంతస్తుల తేడాలు ఎంతగా వున్నా మేం పోగొట్టుకోకూడని దేమిటో తెలియజేశారుగా."

నందూ మాటలకి... నాగుండె లోతులనుండి ఏదో అమృతధార చివ్వున పైకెగసి వచ్చినట్లు పులకింత! అప్రయత్నంగా నాకళ్ళు తడి అయ్యాయి!

అవును కొందరు తమ ప్రవర్తన ద్వారా ఎలా నడుచుకోవాలో తెలియచేస్తారు, మరికొందరు ఎలా ప్రవర్తించకూడదో తెలియచేస్తారు. మానవ జీవితాన్ని మధురతరం, ఐశ్వర్యవంతమూ చేయగలిగేవి మమకారం, ప్రేమానురాగాలే!!

"అమ్మా, ఒకటి చెబుతాను ఏమనుకోవుగా" నందూ మళ్ళా అన్నాడు. ఏమిటన్నట్లుగా చూసింది అమ్మ.

"నువ్వు ఎప్పుడూ ఆ మామయ్యగారిలా గొప్పవాడిని కావాలని చెబుతూంటావుగా! ఆ మామయ్యలా గొప్పవాడిని కావాలని ఎప్పుడూ.. ఇంకెప్పుడూ నాతో చెప్పకు!" అన్నాడు మెల్లగానే అయినా స్థిరమైన కంఠస్వరంతో.

అమ్మ "నందూ" అంటూ వాడి తలని ఒళ్లోకీ లాక్కుంది ఉద్వేగంతో. చెక్కిళ్ళమీదుగా జారిన కన్నీళ్ళు నందూ తలని అభిషేకించాయి.

ఈనాడు ఆదివారం. 17, జూన్, 1990.